సాక్షి అన్నమయ్య జిల్లా

శుక్రవారం, 6, జూన్, 2025



యోగాంధ్రతో ఆరోగ్యాంధ్ర సాధించాలి

యోగాంధ్ర ద్వారా జీవన శైలిలో మార్పులు పొంది ఆరోగ్యాంధ్ర సాధించాలని కడప ఆర్డీఓ జాన్ ఇర్విన్ తెలిపారు. సిద్దవటంలో యోగాంధ్ర నిర్వహించారు. -10లో



రోడ్డు ప్రమాదంలో ఉపాధ్యాయురాలి మృతి

చింతకొమ్మదిన్నె మండలం బుగ్గలేటిపల్లె వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఉపాధ్యాయురాలు రాణికుమారి మృతి చెందారు. -10లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.160	రూ.196
రెండోరకం	రూ.110	రూ.150

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 1687 మెట్రిక్ టన్నులు



న్యూస్‌రీల్

10న అరుణాచలానికి ప్రత్యేక బస్సులు

మదనపల్లె సిటీ: పౌర్ణమి పురస్కరించుకుని ఈనెల 10 వతేదీన ప్రముఖ పుణ్యక్షేత్రమైన అరుణాచలానికి ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు ఆర్టీసీ–1 డిపో సీఐ రేవతి తెలిపారు. అల్ట్రాడీలక్స్ బస్సుకు రాను,పోను చార్జీ రూ. 805 చెల్లించాలన్నారు. ఉదయం 9 గంటలకు డిపో నుంచి బస్సు బయలుదేరుతుందన్నారు. మరిన్ని వివరాలకు 9959225676 నంబరులో సంప్రదించాలని కోరారు.

ప్రకృతి వ్యవసాయంపై మొగ్గు చూపాలి

లక్కిరెడ్డిపల్లి: రైతులు ప్రకృతి వ్యవసాయంపై మొగ్గు చూపాలని జిల్లా వ్యవసాయశాఖాధికారి చంద్రానాయక్ పేర్కొన్నారు. గురువారం మద్దిరేవుల గ్రామంలోని శివమ్మ అనే రైతు పొలంలో ప్రకృతి వ్యవసాయంపై ఆచరణాత్మక ప్రదర్శన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ మొదలైందని, ప్రతి రైతు ప్రకృతి వ్యవసాయ ఎరువులను పొలాలకు ఉపయోగించాలన్నారు. ప్రకృతి వ్యవసాయం రైతుకు లాభదాయకమన్నారు.అనంతరం పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి రమేష్ బాబురావు, ప్రకృతి వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

9 నుంచి యోగాంధ్ర జిల్లా స్థాయి పోటీలు

రాయచోటి జగదాంబసెంటర్: కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ నెల 9 నుంచి 14వ తేదీ వరకు రాయచోటిలోని జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో యోగాంధ్ర జిల్లా స్థాయి పోటీలు నిర్వహించనున్నట్లు విద్యాశాఖాధికారి సుబ్రమణ్యం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల స్థాయిలో నిర్వహించిన పోటీలలో గెలుపొందిన వారికి జిల్లా స్థాయిలో ప్రతి రోజు ఉదయం 7 నుండి 9 గంటల వరకు పోటీలు ఉంటాయన్నారు. 9వ తేదీన సూర్య నమస్కారం/యోగాసనాలు, 10న యోగాపై క్విజ్, 11న ఫొటోగ్రఫీ/షార్ట్ ఫిలిం, 12న పెయింటింగ్, 13 వ్యాసరచన, 14న యోగాపై స్కిట్/రోల్‌ప్లేలు ఉంటాయన్నారు. జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొన్న, గెలుపొందిన వారి వివరాలను అదే రోజు ఉదయం 11 గంటలలోపు కలెక్టర్ కార్యాలయంలో ఇచ్చి యాప్‌లో అప్‌లోడ్ చేస్తారన్నారు. అనంతరం వారిని రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు పంపనున్నట్లు డీఈఓ వివరించారు.

చౌక దుకాణం తనిఖీ

పుల్లంపేట: మండల పరిధిలోని రెడ్డిపల్లి రేషన్ షాపు 8–ఏ చౌక దుకాణాన్ని గురువారం జిల్లా కలెక్టర్ ఛామకూరి శ్రీధర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. 65 సంవత్సరాలు నిండిన వృద్ధులు 37 మంది ఉన్నట్లు తహసీల్దార్ అరవింద కిషోర్ జిల్లా కలెక్టర్‌కు వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ లబ్ధిదారులకు అందజేసే తూకాలలో తేడావస్తే చర్యలు తీసుకుంటామన్నారు. 65 సంవత్సరాలు పైబడిన వారికి డోర్ డెలివరీ చేయాలని చౌక దుకాణాల డీలర్లను కలెక్టర్ ఆదేశించారు. అనంతరం అనంతంపల్లిలో కె వెంకటసుబ్బమ్మకు స్వయంగా కలెక్టర్ చేతుల మీదుగా నిత్యావసర సరుకులు అందజేశారు.


పంచాయతీ కార్యదర్శి తొలగింపు

తిప్పాయపల్లిలోని చెత్తనుండి సంపద కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ఛామకూరి శ్రీధర్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. చెత్తను సేకరించడంలో పంచాయతీ కార్యదర్శి నిర్లక్ష్యం వహించారని, ఆయన్ను వెంటనే విధుల నుండి తొలగించాలని ఎంపీడీఓ జయశ్రీని ఆదేశించారు. అలాగే ఈఓపీఆర్‌డీ ముత్తయ్యకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు.

ఎరువుల కొరత.. రైతు కలత

వ్యవసాయ పంటలు బాగా పండాలంటే సాగునీటితో పాటు ఎరువులూ కీలకమే. సకాలంలో వాటిని వేయకపోతే పంట ఎదుగుదల, దిగుబడి నాణ్యతపై ప్రభావం చూపుతుంది. ప్రస్తుతం రైతు సేవా కేంద్రాల్లో అరకొర నిల్వలు ఉన్నాయి. ఇదే అదనుగా భావించి ప్రైవేట్ ఎరువుల దకాణాల యజమానులు రైతులు ఇష్టానుసారం దోపిడీ చేస్తున్నారు.

- ఖరీఫ్ ప్రారంభమైనా రైతుసేవా కేంద్రాల్లో అరకొర నిల్వలు
- రైతులను దోపిడీ చేస్తున్న ప్రైవేట్ ఎరువుల దుకాణా యజమానులు
- షాపుల ముందు కనిపించని ధరల సమాచారం బోర్డులు



ఖరీఫ్‌లో పొలాల దుక్కులు చేసుకొంటూ పంటల సాగుకోసం సన్నద్ధమవుతున్న రైతులు

గుర్రంకొండ: ఖరీఫ్‌సీజన్ ప్రారంభమైంది. వ్యవసాయపనులు ముందుకు సాగడం లేదు.ఎరువుల కొరతే దీనికి కారణం. అంతేకాకుండా ప్రైవేట్ ఎరువుల దుకాణాల వద్ద ధరలు, స్టాకు వివరాలుగానీ తెలియజేసే సమాచార బోర్డులు లేక పోవడం గమనార్హం. కాగా రైతులు కొనుగోలు చేసే ఎరువులకు బిల్లులు కూడా ఇవ్వడం లేదు. ఈక్రమంలో అన్నదాత అవసరాన్ని, నిస్సహాయతని ఆసరాగా తీసుకొని నకిలీ విత్తనాలు,నకిలీ ఎరువులను అంటగట్టే అవకాశం లేకపోలేదు. రైతులను కాపాడేందకు విత్తనచట్టం ఉన్నా ఎక్కడా అమలు కావడం లేదు. దీంతో రైతుల పరిస్థితి కొనబోతే కొరివి అమ్మబోతే అడవి అన్నచందనంగా మారింది.

నెలరోజులుగా ఇదే పరిస్థితి..

జిల్లాలోని 452 రైతుసేవాకేంద్రాల్లో నెలరోజులుగా ఎరువుల కొరతతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు.కొన్ని కేంద్రాల్లో ప్రస్తుతం పొటాష్, జిప్సమ్ మాత్రమే అందుబాటులో ఉంచారు. మరికొన్ని కేంద్రాల్లో వాటితోపాటు మిగిలిన ఎరువులు 40 శాతం మాత్రమే అందుబాటులో ఉన్నాయి. ఖరీఫ్ సీజన్ ఇప్పటికే ప్రారంభమైంది. వర్షాలు సమృద్ధిగా కరుస్తుండడంతో జిల్లాలోని రైతులు వేరుశనగ, ఇతర ఆరుతడిపంటల సాగుకు సన్నద్ధమవుతున్నారు. ఇప్పటికే పొలాలను దక్కులు చేసుకొని విత్తనాల కోసం వేచిచూస్తున్నారు. పలువురు రైతులు ప్రైవేట్ వ్యాపారుల వద్ద విత్తనాలు కొనుగోలు చేసి సాగుకు సిద్ధంగా ఉన్నారు. అయితే రైతులకు ప్రభుత్వం అందించే సబ్సిడీ ఎరువులు మాత్రం అంతంత మాత్రంగానే అందుబాటులో ఉండడం గమనార్హం. గత ప్రభుత్వ హయాంలో ఖరీఫ్‌సీజన్ ప్రారంభానికి ముందే అన్ని రైతుభరోసా కేంద్రాల్లో ఎరువులను రైతులకు అందుబాటులో ఉంచేవారు. ప్రస్తుతం రైతుసేవా కేంద్రాల్లో డీఏపీ, కాంప్లెక్స్‌లు. యూరియాల స్టాకు అంతంతమాత్రమే.

ప్రైవేట్ డీలర్ల నిలువుదోపిడీ

జిల్లాలో రైతులను ప్రైవేట్ ఎరువుల దుకాణాల డీలర్లు ఇష్టారాజ్యంగా నిలువుదోపిడీ చేస్తున్నారు.రైతుసేవాకేంద్రాల్లో అంతంతమాత్రంగానే ఎరువులు ఉండడంతో రైతులు ప్రైవేట్ ఎరువుల దుకాణాలను ఆశ్రయిస్తున్నారు. ఇదే అదనుగా భావించి డీలర్లు అధిక ధరలకు ఎరువులను విక్రయిస్తూ దోచుకొంటున్నారు. కొనుగోలుచేసిన ఎరువులు, పురుగుల మందులకు రశీదులు ఇవ్వడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు.

రైతులను మోసగిస్తున్నా చర్యలేవీ..

ప్రైవేట్ డీలర్లు ఇష్టానుసారం రైతులను మోసగిస్తున్నా చర్యలు తీసుకోవడంలో అధికారులు విఫలమవుతున్నారనే విమర్శలున్నాయి. విత్తనాలు, కొనుగోలు సమయంలో విత్తన చట్టం ద్వారా సంబంధిత విత్తనాల డీలర్లపై కఠిన చర్యలు చేపట్టే వీలుంది. విత్తన చట్టం 1966, విత్తన నిబంధనలు1968, విత్తన నియంత్రణ–1983 చట్టాల ఆధారంగా అతిక్రమణలు, ఉల్లంఘనలు వర్తించేలా చట్టాన్ని రూపొందించారు. విత్తన విక్రయాల్లో మోసాలకు పాల్పడే వారిపై విత్తన నియంత్రణ ఉత్తర్వులు 1983 క్లాజ్ 3 కింద నిబంధనలు ఉల్లంఘించినందుకు ఆయా దుకాణాల్లో విత్తనాలను జప్తు చేయడంతో పాటు అత్యవసర సరకుల చట్టం 1955 సెక్షన్–ఎ ప్రకారం జరిమానా విధించాలి. ఇన్ని చట్టాలు ఉన్నా అధికారులు మాత్రం అమలు చేయడంలో మీనవేషాలు లెక్కిస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు.

జిల్లాలో రైతుసేవాకేంద్రాలు:	452
ఎరువుల స్టాకు: జిప్సం, పొటాష్‌తో కలిపి:	40 శాతమే
ప్రైవేట్ ఎరువుల దుకాణాలు:	484

చట్టాలు ఉన్నా అమలు ఎక్కడా?

జిల్లాలో సుమారు 484 ప్రైవేట్ ఎరువుల దుకాణాలు నిర్వహిస్తున్నారు. వీటిలో 187 విత్తన విక్రయ డీలర్లు కాగా మిగిలిన దుకాణాల్లో ఎరువులు, పురుగుల మందులు విక్రయిస్తుంటారు. నిబంధనల ప్రకారం ప్రతి ప్రైవేట్ ఎరువుల, విత్తనాల విక్రయ దుకాణాల్లో తప్పనిసరిగా విత్తన లైసెన్స్‌లను ప్రదర్శించాలి. లేకుంటే నోటీసులు ఇచ్చి దానికి సరైన సమాధానం ఇవ్వక పోతే విత్తననియంత్రణ ఉత్తర్వులు 1986 క్లాజ్–5 ప్రకారం డీలర్ లైసెన్స్ రదు చేయడానికి వ్యవసాయాధికారులకు పూర్తి అధికారం ఉంది. అలాగే విత్తనాలు విక్రయించే దుకాణాల్లోనూ, దుకాణం ముందు వైపు కచ్చితంగా ధరలు, స్టాకుల సమాచారాన్ని తెలియజేసే బోర్డులను ఏర్పాటు చేయాలి.లేకపోతే విత్తన నియంత్రణ ఉత్తర్వులు–1983 క్లాజ్ 8 ప్రకారం ఆయా దుకాణాల్లో విత్తనాల అమ్మకాలు నిలుపుదల చేయవచ్చు. విత్తనాల కొనుగోలు సమయంలో రైతులకు తప్పనిసరిగా డీలర్లు రశీదులు ఇవ్వాల్సి ఉంటుంది. ఇవ్వకపోతే విత్తననియంత్రణ ఉత్తర్వులు–1983 క్లాజ్ 9 ప్రకారం డీలర్‌కు నోటీసు ఇచ్చి సమాధానం చెప్పక పోతే లైసెన్స్ రద్దు చేయవచ్చు. కాలం చెల్లిన విత్తనాలు విక్రయిస్తే విత్తన చట్టం 1966సెక్షన్–7 ప్రకారం విత్తన నియంత్రణ ఉత్తర్వులు 1983 క్లాజ్ 8–ను అనుసరించి డీలర్ లైసెన్స్ రద్దు చేస్తారు. రైతుల సంక్షేమం కోసం ఇన్ని చట్టాలు ఉన్నా ఎక్కడా అమలు కావడం లేదు.



గుర్రంకొండలో ఎరువుల దుకాణాల ముందు ధరలు, స్టాకు వివరాలు లేని సమాచార బోర్డు

అధిక ధరలకు విక్రయిస్తున్నారు



ప్రైవేట్ ఎరువుల దుకాణాల్లో డీలర్లు పురుగుల మందులు, ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తున్నారు. అసలే పండించిన పంటలకు మార్కెట్లో గిట్టుబాటుధరలు లేవు. మరోవైపు ఎరువుల దుకాణాల యజమానులు ఇష్టానుసారంగా ఎక్కువ ధరలకు అమ్ముతూ రైతుల్ని దోచుకొంటున్నారు. ఎరువుల కోసం వ్యయ ప్రయాసలు పడుతున్నాం. – నరసింహులు, రైతు, కొత్తపల్లె

ఎరువులు అందుబాటులో లేవు



రైతు సేవాకేంద్రాల్లో అన్ని రకాల ఎరువులు అందుబాటులో లేవు. జిప్సం, పొటాష్ మాత్రమే ఇస్తున్నారు. డీఏపీ, యూరియా వంటి అవసరమైన ఎరువులు ఇవ్వడం లేదు. ఖరీఫ్‌సీజన్ పంటలు సాగు చేసుకోవడానికి అన్ని ఏర్పాట్లు చేసుకొంటున్నాం. అవసరమైన అన్ని రకాల ఎరువులు అందుబాటు ఉంటే రైతులకు ఎంతో మేలు జరుగుతుంది. –రమణమ్మ, రైతు, గుట్టకిందపల్లె

పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలి

జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి

రాజంపేట టౌన్: భావితరాలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని కల్పించేందుకు ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిక్షణలో భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ శ్రీధర్ ఛాముకూరి పిలుపునిచ్చారు. రాజంపేట–రాయచోటి మార్గంలో ఉన్న నగరవనంలో గురువారం అటవీశాఖ ఆధ్వర్యంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం, వనమహోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించారు. కలెక్టర్ శ్రీధర్, రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి , ప్రభుత్వ విప్, రైల్వేకోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్ ముఖ్య అతిథులుగా పాల్గొని మొక్కలను నాటారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వచ్చే ఏడాది నిర్వహించే వనమహోత్సవం నాటికి జిల్లాలో 21 లక్షల మొక్కలను పెంచడం లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు.ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి మాట్లాడుతూ దేశంలో అభివృద్ధి పెరిగే కొద్ది పుడమి తల్లికి కష్టాలు తప్పడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. నింగి, నేల, గాలి కలుషితం అవుతున్నాయన్నారు. ఇది మానవ మనుగడకు శ్రేయస్కరం కాదని తెలిపారు. ప్రభుత్వ విప్ అరవ శ్రీధర్ మాట్లాడుతూ ప్రాణవాయువు కోసం ప్రతి ఒక్కరు మొక్కలను నాటి పెంచాలని తెలిపారు. కాగా రాజంపేట మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాస్‌రెడ్డి, జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, సబ్‌కలెక్టర్లు వైఖోమ్ నైదియాదేవి, మేఘస్వరూప్, డీఎఫ్ఓ ఆర్.జగన్నాథ్‌సింగ్, రాజంపేట ఏఎస్పీ మనోజ్‌రామనాథ్‌హెగ్డె, సబ్‌డీఎఫ్ఓలు జి. సుబ్బరాజు, ఎస్.శ్రీనివాసులు మొక్కలను నాటారు.



మొక్కకు నీళ్లు పోస్తున్న కలెక్టర్ శ్రీధర్



మొక్క నాటి నీళ్లు పోస్తున్న ఎమ్మెల్యే ఆకేపాటి

డీఎస్సీ పరీక్ష నిర్వహణకు పూర్తిస్థాయి సన్నద్ధత

రాయచోటి: జిల్లాలో ఆరు కేంద్రాలలో మెగా డీఎస్సీ పరీక్ష నిర్వహణకు సన్నద్ధంగా ఉన్నామని జిల్లా కలెక్టర్ ఛామకూరి శ్రీధర్ పేర్కొన్నారు. అభ్యర్థులు ఒకటిన్నర గంట ముందే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని సూచించారు. గురువారం సాయంత్రం రాయచోటి కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో కలెక్టర్ మాట్లాడుతూ నిర్ణీత సమయానికి మించి నిమిషం ఆలస్యమైనా పరీక్షకు అనుమతించరన్నారు. పరీక్ష కేంద్రంలోకి ఎలక్ట్రానిక్ వస్తువులకు అనుమతి లేదని తెలిపారు. జిల్లాలో ఆరు కేంద్రాలలో ఈనెల 6వ తేదీ నుండి జూన్ 27 వరకు మెగా డీఎస్సీ పరీక్ష నిర్వహించనున్నట్లు చెప్పారు. 17851 మంది మెగా డీఎస్సీ పరీక్షకు హాజరవుతున్నట్లు తెలిపారు. మదనపల్లెలో మూడు, రాజంపేటలో ఒకటి, రాయచోటిలో రెండు కేంద్రాల్లో పరీక్ష నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. పరీక్ష ఉదయం 9.30 నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరుగుతుందన్నారు. కొన్ని రోజులు మూడు సెషన్లలో పరీక్షలు ఉంటాయన్నారు. అభ్యర్థులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఏపీఎస్ఆర్టీసీ వారు బస్సు సౌకర్యం ఏర్పాటు చేశారన్నారు.

- జిల్లాలోని ప్రజలు జనాభా నిర్వహణ విధానంలో అభిప్రాయాలను ఇచ్చి రాష్ట్ర అభివృద్ధిలో భాగస్వాములు కావాలని కలెక్టర్ ఛామకూరి శ్రీధర్ పిలుపునిచ్చారు. గురువారం జనాభా నిర్వహణ విధానంపై ప్రణాళిక శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన గోడపత్రికలను ఆవిష్కరించారు.

ఖాకీ క్రౌర్యం.. పోయిన ప్రాణం

- పేకాట వ్యవహారంలో నారాయణరెడ్డిపై గంజాయి కేసు
- డబ్బుల ఇవ్వక పోవడంతోనే నమోదు
- బెయిల్‌పై వచ్చినా.. ఇబ్బంది పెట్టిన వైనం
- ఆత్మహత్య చేసుకున్న వైఎస్సార్‌సీపీ కార్యకర్త



రెడ్యం నారాయణరెడ్డి (ఫైల్)



లక్ష్మినారాయణరెడ్డి మృతదేహం వద్ద కుటుంబ సభ్యులను ఓదారుస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా నేతలు

ఖాజీపేట: పోలీసులు పెట్టిన తప్పుడు కేసు, ఆపై వేధింపులు.. ఒక నిండు ప్రాణాన్ని బలితీసుకున్నాయి. ఒక కుటుంబాన్ని వీధిన పడేలా చేశాయి. ఇద్దరు చిన్నారులను తండ్రిని కోల్పోయిన వారిగా మార్చా యి. పేకాట కేసులో తీసుకొచ్చిన వారిపై ఖాజీపేట పోలీసులు కేసులు నమోదు చేయకుండా.. డబ్బులు బేరసారాలు చేయడం, కుదరక పోవడంతో గంజాయి కేసు నమోదు చేశారు. ఈ సంఘటన దుంపలగట్టు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త రెడ్యం శివలక్ష్మినారాయణరెడ్డి ఆత్మహత్యకు కారణమైంది. బాధితులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి.

చెన్నూరు చెక్కర ఫ్యాక్టరీ సమీపంలో మే 6న పేకాట ఆడుతున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. వెంటనే దాడులు చేయడానికి వారు వెళ్లారు. అక్కడ ఎవరూ లేకపోవడంతో.. అక్కడికి వెళ్తున్న ముగ్గురు వ్యక్తులను గుర్తించి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారిని విచారణ చేశారు. సుమారు 12 మంది పేకాట ఆడేందుకు వస్తున్నట్లు అనుమానించారు. అందులో దుర్గం ఖాదర్ బాషా, సిద్దంగారి గురుమహేశ్వర్‌రెడ్డి, రెడ్యం శివలక్ష్మినారాణరెడ్డి, మాచుపల్లి గుర్రప్ప, ఇరగంరెడ్డి భరత్‌రెడ్డి, నాగూర్ బాషా, కమాల్‌బాషా, లక్ష్మిరెడ్డి, నాగేంద్రరెడ్డి, ఫరూక్, కుమార్‌రెడ్డి, లోకేష్‌రెడ్డిలు పేకాట ఆడేందుకు వెళ్తున్నట్లు అనుమానించారు. వారిని మే 6న ఖాజీపేట పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి విచారణ చేశారు. అయితే పేకాట ఆడలేదని వారిలో కొందరు చెప్పారు. దీంతో అప్పుడు కేసు నమోదు చేయకుండా పంపించారు. అనంతరం 7, 8వ తేదీల్లో పిలిపించారు. వారిలో కొందరిని డబ్బులు డిమాండ్ చేశారని బాధితులు తెలిపారు. ఇవ్వక పోవడంతో 9న పేకాటతోపాటు గంజాయి తీసుకొచ్చి అమ్ముతున్నట్లు 12 మందిపై కేసు నమోదు చేశారు. 2.570 గ్రాముల గంజాయి పట్టుకున్నట్లు, రూ 20,500 నగదు, 52 పేక ముక్కలు దొరికినట్లు కేసు కట్టారు. అందులో 9 మందిని అరెస్ట్ చేసి కోర్టుకు పంపించారు. ముగ్గురు వ్యక్తులు తప్పించుకున్నట్లు కేసులో కనపరిచారు.

రెడ్యం శివలక్ష్మినారాయణరెడ్డి ఆత్మహత్య

ఈ కేసులో ఎలాంటి సంబంధం లేని రెడ్యం శివలక్ష్మినారాయణరెడ్డిని నిందితునిగా చేర్చి, అతనిపై గంజాయి కేసు నమోదు చేయడంతో తీవ్ర మనస్తాపానికి గురైనట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మే 9న అరెస్టయిన అతను మే 29న కండీషన్ బెయిల్‌పై బయటికి వచ్చాడు. వచ్చిన తరువాత కూడా తనను పోలీసులు చేసిన చిత్రహింసలకు గురి చేస్తున్నారని కుటుంబ సభ్యులకు వివరించాడు. దెబ్బలను తన భార్య సుభాషిణికి చూపించాడు. తనకు ఎలాంటి సంబంధం లేని కేసులో ఇరికించారని భార్య వద్ద తీవ్ర మనోవేదన వ్యక్తం చేశాడు. దీనికి తోడు కండీషనల్ బెయిల్‌పై రావడంతో.. ప్రతి వారంలో రెండు సార్లు పోలీస్‌స్టేషన్‌కు వచ్చి సంతకాలు చేసి పోవాల్సి వచ్చింది. సంతకాలకు వెళ్లినప్పుడల్లా డబ్బుల కోసం వేధిస్తున్నట్లు భార్య దగ్గర వాపోయాడు. దీంతో తీవ్ర మనోవేదనకు గురై ఆత్మహత్య చేసుకున్నాడు.

విద్యుత్ తీగలు పట్టుకుని..

బుధవారం రాత్రి ఇంటిలో నుంచి బయటికి వెళ్లిన నారాయణరెడ్డి పుష్పగిరికి వెళ్లే రహదారిలోని ట్రాన్స్‌ఫార్మర్ వైరు పట్టుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. అక్కడ చూసిన వారు కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో.. అప్పటికే వెతుకుతున్న కుటుంబ సభ్యులు అక్కడికి వెళ్లి చూసే సరికి మృతి చెంది ఉన్నాడు. అయినా వెంటనే చికిత్స నిమిత్తం కడప రిమ్స్‌కు తరలించారు.

- తన భర్త నారాయణరెడ్డి మృతికి ఖాజీపేట సీఐ మోహన్ వేధింపులే కారణం అని రెడ్యం సుభాషిణి పోలీసులకు ఫిర్యాదు చేసింది.

నా భర్త మృతికి బాధ్యత ఎవరిది?

'నా భర్త నారాయణరెడ్డి పోలీసుల వేధింపులతోనే చనిపోయాడు. మా కుటుంబానికి దిక్కు లేకుండా చేశారు. ఇద్దరు బిడ్డల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారింది. మాకు ఉన్న పెద్ద దిక్కు లేకుండా చేశారు. ఇందుకు కారణం పోలీసులే.. ఇప్పుడు నా భర్త మృతికి బాధ్యత ఎవరు తీసుకుంటారు. నాకు న్యాయం చేయాలి' అని నారాయణరెడ్డి భార్య గుండెలవిసేలా రోదించింది. ఆమె ఆవేదన అక్కడి వారిని కంటతడి పెట్టించింది.

రాజంపేటలో ఢిల్లీ రైల్‌కు హాల్టింగ్!

11నుంచి అమలుకు సన్నాహాలు

రాజంపేట: ఆధ్యాత్మికనగరం తిరుపతి నుంచి దేశరాజధానికి రాజంపేట, నందలూరు, కడప మీదుగా నడిచే ఢిల్లీ రైలు ఏపీసంపర్క్ క్రాంతి (12708/12707)రైలుకు పార్లమెంటరీ నియోజకవర్గ కేంద్రమైన రాజంపేటలో హాల్టింగ్ ఇచ్చారు. దక్షిణ మధ్య రైల్వే జీఎం ఆదేశాల మేరకు గుంతకల్ డివిజనల్ ఉన్నతాధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఈ నెల 11 నుంచి రాజంపేటలో ఏపీ సంపర్క్ క్రాంతి రైలు ఆగుతుందని రైల్వే వర్గాలు ధ్రువీకరించాయి. ఈ మేరకు డివిజన్ కేంద్రానికి ఎస్సీ రైల్వే జీఎం నుంచి ఆదేశాలు వెలువడ్డాయి. గత 17 సంవత్సరాలుగా ఢిల్లీ రైలు రాజంపేట మీదుగా నడుస్తోంది. ఆయా రాష్ట్రాల్లోని అధ్యాత్మిక కేంద్రాల నుంచి ఢిల్లీకి వేగవంతమైన ప్రయాణానికి నేరుగా అనుసంధానం చేయడానికి అప్పటి రైల్వేమంత్రి లాలుప్రసాద్‌యాదవ్ సంపర్క్ క్రాంతిరైళ్లను తీసుకొచ్చారు. 2005 మార్చి రైల్వే బడ్జెట్‌లో ప్రకటించారు. అదే సమయంలో సికింద్రాబాద్ జోనల్ ప్రధానకార్యాలయం, సికింద్రాబాద్ జంక్షన్ ఢిల్లీ నిజాముద్దీన్‌కు ఏపీ సంపర్క్ క్రాంతి ఎక్స్‌ప్రెస్‌రైలును జూలై 2005లో పట్టాలెక్కించారు.

దివంగత సీఎం వైఎస్సార్ చొరవతో..

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి దృష్టి ఏపీ సంపర్క్ క్రాంతి ఎక్స్‌ప్రెస్ రైలుపై పడింది. ఈ రైలును అధ్యాతికనగరం తిరుపతి నుంచి కడప, రాజంపేట పార్లమెంటరీ కేంద్రాలైన రాజంపేట, కడప మీదుగా సికింద్రాబాద్ వరకు నడిపించాలని రైల్వేమంత్రిత్వశాఖను కోరారు. 2007లో ఈ రైలు సికింద్రాబాద్ టు ఢిల్లీకి నడిచింది.దీనిని తిరుపతి నుంచి రేణిగుంట, రాజంపేట, నందలూరు, కడప ,గుత్తి, డోన్, కర్నూలు, మహబూబ్‌నగర్ మీదుగా పొడిగించారు.

- సీమ ప్రాంత ప్రజలకు ముఖ్యంగా ఉమ్మడి కడప జిల్లా వాసులు ఢిల్లీకి వెళ్లడానికి ఒక్కరైలు కూడా లేదు. వీరు ఢిల్లీ, ఉత్తరాది నగరాలకు వెళ్లాలంటే రేణిగుంటకు వచ్చి, అక్కడి నుంచి కేరళ ఎక్స్‌ప్రెస్ ద్వారా వయా నెల్లూరు, గూడూరు మీదుగా వెళ్లాల్సిన పరిస్థితులు ఉండేవి. అయితే వైఎస్సార్ చొరవ వల్ల ఇప్పుడు నేరుగా జిల్లా మీదుగా దేశరాజధానికి వెళ్లేందుకు రైలు అందుబాటులోవచ్చింది.



ఏపీసంపర్క్ క్రాంతి ఎక్స్‌ప్రెస్‌రైలు

ఫలించిన ఎంపీ మిథున్‌రెడ్డి కృషి

17ఏళ్లుగా రాజంపేటలో హాల్టింగ్ కావాలన్న డిమాండ్‌ను కేంద్రానికి వినిపిస్తూనే ఉన్నారు. కేంద్ర రైల్వేమంత్రిత్వశాఖ, రైల్వేబోర్డుకు ఎంపీ పీవీ మిథున్‌రెడ్డి వినతులు అందజేస్తున్నారు. 11 ఏళ్ల రైలు హాల్టింగ్ కోసం కృషి చేశారు. గత ఏడాది అక్టోబరు 24న విజయవాడలో జరిగిన ఎంపీల సమావేశంలో, దేశరాజధానిలో రైల్వేమంత్రిత్వశాఖ దృష్టికి ఈ అంశాన్ని తీసుకెళ్లారు. ఎంపీకి రాజంపేట ప్రాంతీయులు కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు.



రైల్వేమంత్రి అశ్విని వైష్ణవ్‌కు వినతిపత్రం అందచేస్తున్న వైఎస్సార్‌సీపీ లోక్‌సభ ఫ్లోర్‌లీడర్ పీవీ మిథున్‌రెడ్డి (ఫైల్)


హర్షణీయం



ఏపీ సంపర్క్ క్రాంతి ఎక్స్‌ప్రెస్ రైలు హాల్టింగ్ కల్పించడం హర్షణీయం. ఈ రైలు మన ప్రాంతం మీదుగా వెళ్లడానికి దివంగత సీఎం వైఎస్‌రాజశేఖర్‌రెడ్డి కారణం ఇప్పుడు ఈ రైలుకు హాల్టింగ్ రావడం వెనుక ఎంపీ మిథున్ రెడ్డి కృషి ప్రశంసనీయం. రైలు రాజంపేటలో ఆగడం వల్ల అటు తెలంగాణకు, దేశరాజధానికి వెళ్లేందుకు అదనంగా మరో రైలు ఉన్నట్లే.

–పోలా శ్రీనివాసులరెడ్డి, మున్సిపల్ చైర్మన్ రాజంపేట

జిల్లావాసులకు శుభవార్త



ఢిల్లీ రైలు హాల్టింగ్‌కు ఎంపీ పీవీ మిథున్‌రెడ్డి కృషి ఫలించింది. ఎట్టకేలకు రైల్వేఅధికారులు హాల్టింగ్‌ను ఈనెల 11 నుంచి అమలుచేయనున్నారు. జిల్లా వాసులకు శుభవార్త.

–తల్లెం భరత్‌కుమార్‌రెడ్డి, డీఆర్‌యుసీసీ,సభ్యుడు, రాజంపేట

క్లుప్తంగా

ఆటో డ్రైవర్‌పై దాడి



దాడిలో గాయపడిన ఆటో డ్రైవర్ మహేష్

మదనపల్లె రూరల్ : ఆటో డ్రైవర్‌పై నలుగురు వ్యక్తులు దాడి చేసిన సంఘటన గురువారం మదనపల్లెలో జరిగింది. మండలంలోని పోతబోలు పంచాయతీ గాండ్లపల్లికు చెందిన మహేష్(33) ఆటో నడుపుకుంటూ జీవిస్తున్నాడు. గురువారం పట్టణంలోని చిత్తూర్ బస్టాండ్ నుంచి ఆటోలో ఆర్టీసీ బస్టాండ్ వైపు వెళుతుండగా, మార్గమధ్యంలోని సీటీఎం రోడ్డులో ప్రమాదవశాత్తు మరో ద్విచక్ర వాహనాన్ని స్వల్పంగా ఢీకొన్నాడు. ఆటో ఆపి ద్విచక్ర వాహనదారులతో మాట్లాడే ప్రయత్నం చేస్తుండగానే, ద్విచక్ర వాహనం లోని ఇద్దరు వ్యక్తులతో పాటు మరో వాహనంలోని ఇద్దరు వ్యక్తులు కలిసి మహేష్ పై దాడి చేసి తీవ్రంగా కొట్టారు. స్థానికుల సాయంతో మహేష్ ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి చేరుకుని చికిత్స పొందాడు. దాడి ఘటనపై టూ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

రోడ్డు ప్రమాదంలో కదిరి వాసికి తీవ్ర గాయాలు



రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన కదిరివాసి బాలాజీ నాయక్

మదనపల్లె రూరల్ : రోడ్డు ప్రమాదంలో కదిరి వాసి తీవ్రంగా గాయపడి పరిస్థితి విషమించిన సంఘటన గురువారం మదనపల్లె మండలంలో జరిగింది. సత్యసాయి జిల్లా కదిరి పట్టణానికి చెందిన బాలాజీ నాయక్ (35), కుటుంబ సభ్యులు మరికొందరితో కలిసి చౌడేపల్లి మండలం బోయకొండకు వచ్చారు. మొక్కుబడి తీర్చుకుని తిరిగి స్వగ్రామానికి పయనమయ్యారు. కుటుంబ సభ్యులను వ్యానులో ఎక్కించి, బాలాజీ నాయక్ ద్విచక్ర వాహనంలో బయలుదేరాడు. మార్గమధ్యంలోని వలసపల్లె వద్ద మరో ద్విచక్ర వాహనం ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన స్థానికులు బాధితుడిని మదనపల్లి ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం తిరుపతి రుయాకు రెఫర్ చేశారు. తాలూకా పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

జీపు- ఆటో ఢీకొని ఇరువురికి తీవ్ర గాయాలు

లక్కిరెడ్డిపల్లి : రాయచోటి-వేంపల్లి మార్గమధ్యంలోని నెహ్రూ నగర్‌కు వెళ్లే సమీపంలో గురువారం ఆటో-జీపు ఢీ కొన్న సంఘటనలో జీపులో ప్రయాణిస్తున్న డ్రైవర్‌తోపాటు మరో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన ఆంజనేయులుతోపాటు జీప్ డ్రైవర్ బాబా అనే వ్యక్తిని 108 ద్వారా లక్కిరెడ్డిపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యంకోసం రాయచోటి ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లినట్లు సమాచారం. ఈ మేరకు లక్కిరెడ్డిపల్లి పోలీసులు కేసు నమోదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో ఉపాధ్యాయురాలి మృతి

రాయచోటి డిప్యూటీ డీఈఎంఓ దేవశిరోమణికి తీవ్ర గాయాలు



ప్రమాదంలో నుజ్జునుజ్జుగా మారిన కారు



ప్రమాదంలో మృతి చెందిన రాణికుమారి





గాయపడిన కారు డ్రైవర్ పెంచలబాబు, డిప్యూటీ డీఎంఈఓ దేవ శిరోమణి



ప్రమాద స్థలంలో లభించిన బంగారు ఆభరణాలు

చింతకొమ్మదిన్నె : చింతకొమ్మదిన్నె మండలం బుగ్గలేటిపల్లె సమీపంలో జాతీయ రహదారిపై గురువారం మధ్యాహ్నం 3.30 గంటలకు జరిగిన రోడ్డు ప్రమాదంలో ప్రభుత్వ ఉపాధ్యాయురాలు రాణి కుమారి (52) మృతి చెందారు. వివరాలు ఇలా ఉన్నాయి. ఏపీ39 ఏజెడ్ 2259 నెంబర్ గల స్విఫ్ట్ డిజైర్ కారు రాయచోటి వైపు నుంచి కడపకు వస్తుండగా ముందు వెళుతున్న గుర్తు తెలియని వాహనాన్ని ఢీకొంది. ఇదే సమయంలో రాయచోటి వైపు నుంచి వస్తున్న ఏపీ 39 క్యూవీ 0525 నెంబర్ గల కారు వేగాన్ని అదుపుచేయలేక స్విఫ్ట్ డిజైర్ కారును ఢీకొంది. ఈ ప్రమాదంలో స్విఫ్ట్ కారులో స్వయంగా వాహనాన్ని నడుపుతున్న కడప రాఘవేంద్ర టౌన్‌షిప్‌లో నివాసం ఉంటూ రామాపురం మండలం సరస్వతిపల్లె ఎంపీపీ స్కూలు ఉపాధ్యాయురాలుగా విధులు నిర్వహిస్తున్న రాణికుమారి అక్కడికక్కడే మృతి చెందారు. రాయచోటి వైపు నుంచి వస్తుండిన మరో కారులో ప్రయాణిస్తున్న రాయచోటి డిప్యూటీ డీఈఎంఓ అధికారి దేవశిరోమణితోపాటు కారు డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన వారిని అంబులెన్స్ ద్వారా రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. కాగా ప్రభుత్వ ఉపాధ్యాయురాలైన రాణికుమారికి భర్త పుల్లయ్య, ఇరువురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. కుమార్తెలు విదేశాల్లో ఉన్నట్లు సమాచారం. రాణి కుమారి కారులో నుంచి హైవే పెట్రోలింగ్ కానిస్టేబుల్ నరసింహులు బ్యాగులను స్వాధీనం చేసుకుని అందులోని సుమారు 50 తులాలకుపైగా బంగారు ఆభరణాలతో కూడిన రెండు బ్యాగులను చింతకొమ్మదిన్నె పోలీసులకు ఇచ్చారు. వారు వాటిని సంఘటన ప్రాంతంలోనే మృతురాలి బంధువులకు అప్పగించారు. గాయపడిన దేవశిరోమణి కడప నగరంలోని రాజారెడ్డి వీధి నివాసురాలు, ఈమె కారు డ్రైవర్ పెంచల బాబు కూడా కడపలోనే ఉంటున్నారు. ఈ ప్రమాదంలో రెండు కార్లలోని ఎయిర్ బెలూన్లు తెరుచుకోక పోవడం గమనార్హం. ఈ రోడ్డు ప్రమాదంపై చింతకొమ్మదిన్నె పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

లారీ ఢీకొని వీఆర్ఓ దుర్మరణం



ఈశ్వరయ్య మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు



ఈశ్వరయ్య(ఫైల్)

కమలాపురం : కడప-తాడిపత్రి ప్రధాన రహదారిలో రామచంద్రాపురం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో కమలాపురం మండలానికి చెందిన వీఆర్ఓ ఈశ్వరయ్య (59) మృతి చెందారు. టి.చదిపిరాళ్లకు ఇన్‌చార్జి వీఆర్ఓగా పని చేస్తున్న ఈశ్వరయ్య గురువారం జంగంపల్లెలో రేషన్ సరుకులు పంపిణీ చేసేందుకు డీలర్ సతీష్ అలియాస్ నానిని తన బైక్‌లో ఎక్కించుకుని చదిపిరాళ్ల నుంచి బయలుదేరారు. మార్గ మధ్యంలో రామచంద్రాపురం వద్దకు రాగానే కడప నుంచి ఎర్రగుంట్ల వైపు వెళ్తున్న లారీ ఈశ్వరయ్య బైక్‌ను ఢీ కొంది. ఈ ఘటనలో ఈశ్వరయ్య తలకు తీవ్ర గాయాలయ్యాయి. వెనుక ఉన్న నాని ఎగిరి పడటంతో కాలు విరిగింది. స్థానికులు గమనించి చికిత్స నిమిత్తం కమలాపురం ఆసుపత్రికి తరలించారు. అక్కడి వైద్యులు పరీక్షించి అప్పటికే ఈశ్వరయ్య మృతి చెందినట్లు నిర్ధారించారు. కాగా మృతునికి భార్య, వివాహిత కుమార్తె ఉన్నారు. ఈశ్వరయ్య అందరితో కలివిడిగా ఉండటంతో ప్రజలు ఆసుపత్రికి తండోపతండాలుగా చేరుకున్నారు. ఈశ్వరయ్య మృతదేహాన్ని చూసి కుటుంబ సభ్యులు కన్నీటి పర్యంతమయ్యారు. ప్రభుత్వ ఒత్తిడి, టార్గెట్ల కారణంగానే ఈశ్వరయ్య మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కాగా పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని రిమ్స్‌కు తరలించారు.

ఇది ప్రభుత్వ హత్యే..

వీఆర్ఓ ఈశ్వరయ్యది ప్రభుత్వ హత్యే అని ప్రభుత్వ మాజీ ఉద్యాన సలహాదారు సంబటూరు ప్రసాదొరెడ్డి ఆరోపించారు. ప్రభుత్వ ప్రచార ఆర్భాటాల కోసమే క్షేత్ర స్థాయి సిబ్బందిపై పని ఒత్తిడి పెంచారన్నారు. ఈ క్రమంలోనే మధ్యాహ్న భోజనం కూడా తినకుండానే రేషన్ సరుకుల పంపిణీ కోసం ఫింగర్ వేయడానికి వెళ్లిన ఈశ్వరయ్య ఇలా మృత్యువాత పడటం విచారకరమన్నారు. వీఆర్ఓ ఈశ్వరయ్య కుటుంబ సభ్యులకు అన్ని రకాల బెనిఫిట్స్ అందించి కుటుంబ సభ్యులకు ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు.

తహసీల్దార్లకు ప్రశంసా పత్రాలు



తహసీల్దార్లకు ప్రశంసాప్రత్రాలను అందజేస్తున్న జిల్లా కలెక్టర్ శ్రీధర్

రాయచోటి : ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రత్యేక చొరవ చూపిన తహసీల్దార్లకు జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ ప్రశంసాపత్రాలను అందించారు. గురువారం సాయంత్రం రాయచోటి కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో జిల్లా కలెక్టర్ కలికిరి, కోడూరు మండలాల తహసీల్దార్లకు ప్రశంసాపత్రాలను అందజేశారు. కోడూరు మండలం చియ్యవరం గ్రామంలో 25 ఏళ్లుగా పరిష్కారం కాని దారి సమస్యను తహసీల్దార్ మహబూబ్‌చాంద్ గ్రామస్తులతో మాట్లాడి శాంతియుతంగా పరిష్కరించారని పేర్కొన్నారు. అలాగే కలికిరి మండలం పారపట్ల గ్రామంలోని కురువపల్లెల్లో 20 ఏళ్లుగా ఉన్న దారి సమస్యను తహసీల్దార్ మహేశ్వరీబాయి గ్రామస్తులతో మాట్లాడి శాంతియుతంగా చర్చల ద్వారా పరిష్కరించారని కలెక్టర్ పేర్కొన్నారు. ఎన్నో ఏళ్లుగా పరిష్కారం దొరకని దారి సమస్యలకు చర్చల ద్వారా పరిష్కారం చూపడం శుభపరిణామమన్నారు. కార్యక్రమంలో జిల్లా సంయుక్త కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్, డీఆర్ఓ మధుసూదన్ రావు తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు కేసుల్లో 16 మంది అరెస్టు

రాయచోటి టౌన్ : వేర్వేరు కేసుల్లో 16 మందిని అరెస్టు చేసినట్లు రాయచోటి అర్బన్ సీఐ బీవీ చలపతి తెలిపారు. రాయచోటి రూరల్ పరిధిలోని ఎగువ అబ్బవరం గ్రామానికి చెందిన ఆవుల గంగిరెడ్డి తన ఇంటి ముందు నుంచి మట్టి, ఇసుకను ట్రాక్టర్ల ద్వారా తరలిస్తూ ఉండటంతో అభ్యంతరం తెలిపాడు. దీనిపై ట్రాక్టర్ యజమానితో పాటు మరికొందరు ఆయనతో గొడవపడ్డారు. ఈ విషయమై ఈ నెల 2వ తేదీ తహసీల్దార్‌కు ఫిర్యాదు చేసేందుకు గంగిరెడ్డి మోటార్ బైకుపై వెళుతుండగా అడ్డగించి దాడి చేసి గాయపరిచారు. దీనిపై బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. నిందితులను గురువారం ఎస్ఐ విష్ణువర్ధన్ అరెస్టు చేశారు. అలాగే రెండేళ్ల క్రితం ఒక అమ్మాయి విషయమై గొడవ పడిన సంఘటనలో తొమ్మిది మందిని అరెస్టు చేసినట్లు అర్బన్ సీఐ తెలిపారు.


ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌కు బారికేడ్లు వితరణ



బారికేడ్లు స్వీకరిస్తున్న ట్రాఫిక్ సీఐ విశ్వనాథరెడ్డి

రాయచోటి టౌన్ : రాయచోటి నియోజకవర్గంలోని రాయచోటి, లక్కిరెడ్డిపల్లె, రామాపురం మండల పరిధిలోని పోలీస్ స్టేషన్లతో పాటు రాయచోటి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌కు భారతి సిమెంట్ యాజమాన్యం బారికేడ్లు వితరణ చేసింది. గురువారం కంపెనీ ప్రతినిధులు రాయచోటి ట్రాఫిక్ సీఐ విశ్వనాథరెడ్డికి వీటిని అందజేశారు. వీటిని ప్రధాన కూడళ్ల వద్ద ఏర్పాటు చేసి ట్రాఫిక్ నియంత్రణ కోసం కృషి చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో భారతి సిమెంట్ కంపెనీ మార్కెటింగ్ మేనేజర్ ప్రతాప్ రెడ్డి, సిబ్బంది రమణారెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, డీలర్లు పి. రాజ, ఎం.లియాఖత్ ఆలీఖాన్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి జర్నలిస్టు క్రికెట్ టోర్నమెంట్ విజేత కడప



జర్నలిస్టు క్రికెట్ టోర్నమెంట్ విజేతగా నిలిచిన వైఎస్సార్ కడప జిల్లా జట్టు

కడప వైఎస్ఆర్ సర్కిల్ : గుంటూరులో జరిగిన రాష్ట్ర స్థాయి జర్నలిస్టు క్రికెట్ టోర్నమెంట్‌లో వైఎస్సార్ కడప జిల్లా జట్టు విజయం సాధించినట్లు కడప జర్నలిస్టు టీం మేనేజర్ భూమిరెడ్డి శ్రీనాథ్ రెడ్డి తెలిపారు. గుంటూరు పోలీసు గ్రౌండ్‌లో జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో చిత్తూరు జట్టుపై భారీ విజయం సాధించి కప్పును కైవసం చేసుకుందన్నారు. నెల్లూరు, విజయనగరం, శ్రీకాకుళం, చిత్తూరు జట్ల పైన విజయం సాధించారన్నారు. కడప టీం సభ్యుడు పఠాన్ సెంచరీ సాధించి మ్యాన్ ఆఫ్ ది సిరీస్‌గా నిలిచాడు.

ఎలక్ట్రీషియన్ ఆత్మహత్య



హరిప్రసాద్ (ఫైల్)

మదనపల్లె రూరల్ : అనారోగ్య కారణాలతో ఎలక్ట్రీషియన్ ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన గురువారం మదనపల్లెలో వెలుగు చూసింది. మండలంలోని కొత్తపల్లి పంచాయతీ కొత్త ఇండ్లుకు చెందిన హరి ప్రసాద్ (32) ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తూ జీవిస్తున్నాడు. అతనికి భార్య నాగవేణి రెండు సంవత్సరాల వయసున్న కుమారుడు ఉన్నారు. అయితే గత కొంతకాలంగా హరిప్రసాద్ కిడ్నీ, లివర్ సంబంధిత వ్యాధులతో తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నాడు. వ్యాధులను బాగు చేసుకునేందుకు పలు ఆసుపత్రుల చుట్టూ తిరిగాడు. అయినా పరిస్థితి మెరుగు పడకపోగా నానాటికి క్షీణిస్తూ ఉండడంతో మానసికంగా కుంగిపోయాడు. వారం రోజుల క్రితం భార్య నాగవేణి కుమారుడిని, ఆమె పుట్టిల్లు అయిన చౌడేపల్లి మండలం చదళ్ల పంచా యతీ బోయపల్లెలో విడిచిపెట్టి వచ్చాడు. గురువారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికులు తాలూకా పోలీసులకు సమాచారం అందించడంతో, వారు సంఘటన స్థలానికి చేరుకుని ఆత్మహత్యకు గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. కేసు విచారణ చేస్తున్నారు.

కుటుంబ సమస్యలతో..



శంకర (ఫైల్)

మదనపల్లె రూరల్ : కుటుంబ సమస్యలు, భార్య అనారోగ్యం, అప్పులు తదితర కారణాలతో ఓ వ్యక్తి ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన గురువారం ములకలచెరువు మండలంలో వెలుగు చూసింది. మండలంలోని మద్దినాయన పల్లె పంచాయతీ నాయనవారిపల్లెకు చెందిన పెద్ద రెడ్డప్ప కుమారుడు శంకర (39) వ్యవసాయ పనులు చేస్తూ జీవిస్తున్నాడు. అతని భార్య రాధమ్మ స్థానికంగా అంగన్వాడీ టీచర్‌గా పని చేస్తూ ఉంది. ఆరు నెలల క్రితం ప్రమాదం కారణంగా రాధమ్మకు కాలు విరిగింది. ఆమెకు చికిత్స చేయించడానికి పలువురి వద్ద శంకర, దాదాపు రూ 10 లక్షలు అప్పులు చేశాడు. ఇటీవల కొంతకాలంగా రుణ దాతల నుంచి ఒత్తిడి అధికం కావడం. దీనికి తోడు కుటుంబ సమస్యలతో ఇంట్లో గొడవలు జరుగుతుండడం, తదితర కారణాలతో మనస్తాపం చెంది, బుధవారం రాత్రి ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గురువారం ఉదయం గమనించిన కుటుంబ సభ్యులు కిందికి దించి పరిశీలించగా అప్పటికే మృతి చెందాడు. దీంతో ములకలచెరువు పోలీసులకు సమాచారం అందించి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మదనపల్లి ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు. ములకలచెరువు పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

జీవితంపై విరక్తితో..

లింగాల : మండలంలోని తాతిరెడ్డిపల్లె గ్రామంలో గురువారం గవిరెడ్డి శివారెడ్డి (60) అనే వ్యక్తి తన ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. అతను చాలా కాలం నుంచి దీర్ఘకాలిక వ్యాధితో బాధపడుతున్నాడు. ఆలనా పాలనా చూసేందుకు భార్య లేకపోవడంతోపాటు గతంలోనే కుమారుడు మృతి చెందాడు. దీంతో ఆయన జీవితంపై విరక్తి చెంది తన పాత ఇంట్లో దంతెలకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు లింగాల పోలీసులు తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పేర్కొన్నారు.

మహానాడు ఉల్లంఘనలు కనిపించలేదా?



సాంబశివ

మదనపల్లె : ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘించిన ప్రైవేటు బస్సులకు జరిమానా విధించడం సరైన చర్య అయితే అవే నిబంధనలు ఉల్లంఘించి కడపలో జరిగిన టీడీపీ మహానాడుకు జనం తరలించడానికి ఏ నిబంధనలతో ప్రైవేటు విద్యాసంస్థల బస్సులకు అనుమతి ఇచ్చారో ప్రజలకు చెప్పాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ డిమాండ్ చేశారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ నిబంధనలు ఉల్లంఘించారని మదనపల్లె నుంచి నడుస్తున్న ప్రైవేటు బస్సులకు రవాణా శాఖ అధికారులు జరిమానా వేశారన్నారు. అవే నిబంధనలు ఉల్లంఘించి కడపలో జరిగిన టీడీపీ మహానాడుకు మదనపల్లి నియోజకవర్గం నుంచి ప్రైవేటు విద్యాసంస్థలకు చెందిన బస్సులు ఏ ప్రభుత్వ నిబంధనల ప్రకారం పంపారో ఆర్టీఓ ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రైవేటు బస్సుల విషయంలో ఒకలా, ప్రైవేటు విద్యాసంస్థలకు చెందిన బస్సుల పట్ల మరోలా వ్యవహరించడం పట్ల వెనుక ఉన్న రాజకీయ దురుద్దేశం ఏమిటని ప్రశ్నించారు.

యోగాంధ్రతో ఆరోగ్యాంధ్ర సాధించాలి



సిద్దవటం కోటలో యోగాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న దృశ్యం

సిద్దవటం : యోగాంధ్ర ద్వారా జీవన శైలిలో మార్పులు పొంది ఆరోగ్యాంధ్ర సాధించాలని కడప ఆర్డీఓ జాన్ ఇర్విన్ తెలిపారు. మండల కేంద్రమైన సిద్దవటంలోని మట్లిరాజుల కోట పార్కు ప్రాంతంలో గురువారం యోగాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలలో ఆరోగ్యం పట్ల అవగాహన పెంచుతూ , రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన యోగాంధ్రలో భాగంగా సిద్దవటం మట్లిరాజుల కోటలో యోగాను ఏర్పాటు చేశామన్నారు. రోజుకు కేవలం 30 నిమిషాలు యోగా చేస్తే శారీరక దృఢత్వం, మానసిక శాంతి, సిద్ధిస్తాయన్నారు. ఒత్తిడి నుంచి ఉపశమనం పొందడానికి యోగా ఒక ఉత్తమ మైన మార్గం అని ఆయన తెలిపారు. జిల్లా యోగా స్పెషల్ ఆఫీసర్ సురేష్ బాబు మాట్లాడుతూ ఇలాంటి యోగా కార్యక్రమాలు పాఠశాల స్థాయిలో నిర్వహించే యువతలో ఆరోగ్య చైతన్యం, పెరుగుతుందన్నారు. ఒత్తిడి నుంచి ఉపశమనం పొందడానికి యోగా నిర్వహించడం ఒక ఉత్తమమైన మార్గం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో యోగా ట్రైనర్స్ మాధవి, ప్రసాద్, మెప్మా పీడీ కిరణ్‌కుమార్‌రెడ్డి, మండల స్పెషల్ ఆఫీసర్ జయసింహ, తహసీల్దారు తిరుమలబాబు, ఎంపీడీఓ ఫణిరాజకుమారి, ఎస్.ఐ మహమ్మద్‌రఫీ, వైద్యులు డాక్టర్ ప్రకాష్, డాక్టర్ రంగలక్ష్మి, డాక్టర్ మురళి, ఎస్. ఎం.డి హమీద్, పంచాయతీరాజ్ ఏఈ నాగరాజు, డిప్యూటీ తహసీల్దార్ మాధవీలత, ఈఓపీఆర్‌డీ మోహతాబ్ యాస్మిన్, వెలుగు ఏపీఎం సుజాత, సీసీలు, ఉపాధి ఏపీఓ నరసింహులు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, వీఆర్ఓలు, బెటాలియన్ పోలీసులు, డ్వాక్రా మహిళలు, అంగన్‌వాడీ వర్కర్‌లు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

మోడీ సర్కారు బాటలో రాష్ట్ర ప్రభుత్వం



పి.శ్రీనివాసులు

మదనపల్లె రూరల్ : కార్మిక చట్టాలకు వ్యతిరేకంగా జూలై 9న దేశవ్యాప్తంగా కార్మికవర్గం సమ్మెకు సన్నద్ధమవుతున్న దశలో రాష్ట్రంలో పని గంటలు పెంచుతూ రాష్ట్ర కేబినెట్ తీసుకున్న నిర్ణయాన్ని సీపీఎం జిల్లా కమిటీ తీవ్రంగా ఖండిస్తున్నట్లు జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు తెలిపారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ కార్మిక హక్కులపై దాడి చేస్తున్న కేంద్రంలోని నరేంద్ర మోడీ సర్కారు బాటలో రాష్ట్ర ప్రభుత్వం కార్మికలోకంపై పెనుదాడి చేసిందన్నారు. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ పేరుతో, కార్పొరేట్లకు రెడ్ కార్పెట్ పరుస్తూ కార్మికులు ఏళ్ల తరబడి పోరాడి సాధించుకున్న హక్కులను ఒక్కసారిగా దిగమింగిందన్నారు. ఎనిమిది గంటల పనిదినం ఆచరణలో ఎప్పుడో తొమ్మిది గంటలకు చేరుకోగా, తాజా మంత్రివర్గ సమావేశంలో దానిని పది గంటలకు పెంచుతూ నిర్ణయం తీసుకున్నారన్నారు. మహిళా సాధికారత పేరుతో మహిళలకు కూడా నైట్‌షిఫ్ట్‌ల భారాన్ని తప్పనిసరి చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించడంలో ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. శాస్త్ర సాంకేతిక అభివృద్ధి జరుగుతున్న కాలంలో ఏఐ విస్తరించి, మానవ శ్రమను తగ్గిస్తున్న ఆధునిక యుగంలో పనిగంటలు తగ్గించాల్సింది పోయి పెంచడం దారుణమన్నారు. కార్మిక సంక్షేమం దృష్ట్యా రాష్ట్రంలో లేబర్ కోడ్స్ అమలును నిలిపి వేయాలని డిమాండ్ చేశారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో పలువురికి గాయాలు





క్షతగాత్రులను 108 సాయంతో ఆసుపత్రి తరలిస్తున్న దృశ్యం, గాయిపడిన నాగేంద్ర

సంబేపల్లె : మండల పరిధిలోని శెట్టిపల్లె, నారాయణరెడ్డిపల్లె గ్రామాలలో గురువారం జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాలలో పలువురు గాయపడ్డారు. పోలీసుల వివరాల మేరకు ... మండల పరిధిలోని నాగిరెడ్డిగారిపల్లెకు చెందిన దొరబాబు, అక్క పద్మావతమ్మతో కలిసి ద్విచక్రవాహనంలో శెట్టిపల్లె నుంచి సొంత గ్రామానికి సీకే రోడ్డుపై వెళుతుండగా గంగన్నగారిపల్లె సమీపంలోని మలుపు వద్దకు రాగానే శెట్టిపల్లె నుంచి దేవపట్లకు వెళుతున్న కారు అదుపు తప్పి ముందు వెళుతున్న బైకును ఢీకొంది. ఈ ప్రమాదంలో ద్విచక్రవాహనంలో ప్రయాణిస్తున్న దొరబాబు, పద్మావతితో పాటు మరొకరికి గాయాలయ్యాయి. గాయపడిన వారిని 108 సాయంతో రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అలాగే సంబేపల్లె అంబేద్కర్ నగర్ కాలనీకి చెందిన నాగేంద్ర తన భార్య హరితతో కలిసి చిన్నమండెంకు వెళుతుండగా నారాయణరెడ్డిపల్లె పంచాయతీ ముదివాండ్లపల్లె సమీపంలో ఆటో అదుపు తప్పి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో గాయపడిన ఇద్దరిని 108 వాహనంలో రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు సంబేపల్లె పోలీసులు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

గ్యాస్ సిలిండర్ పైప్ లీకేజీతో..



గ్యాస్ సిలిండర్ పేలి తీవ్రంగా గాయపడిన బాధితులు

మదనపల్లె రూరల్ : గ్యాస్ సిలిండర్ పైప్ లీకేజీతో ముగ్గురు తీవ్రంగా గాయపడిన సంఘటన గురువారం మదనపల్లెలో జరిగింది. పట్టణంలోని నీరుగట్టువారిపల్లెలో రూ. 99 బాక్స్ బిర్యానీ సెంటర్ హోటల్ నడుపుతున్నారు. గురువారం మధ్యాహ్నం హోటల్ బాగా రద్దీగా ఉన్న సమయంలో, సిలిండర్ నుంచి స్టౌ కు వెళ్లే గ్యాస్ పైప్ లీకేజీతో ఒక్కసారిగా మంటలు చెలరేగి ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో అదే సమయానికి బిరియాని పార్సిల్ తీసుకువెళ్లేందుకు అక్కడికి వచ్చిన, నీరుగట్టు వారి పల్లెకు చెందిన రామ్మోహన్ (38), నక్కలదిన్నెకు చెందిన మునెమ్మ (40), పట్టణానికి చెందిన సురేంద్ర (36), మంటలు అంటుకుని తీవ్రంగా గాయపడ్డారు. గమనించిన స్థానికులు అగ్నిమాపక శాఖ అధికారులకు సమాచారం అందించి బాధితులను ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక శాఖ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని మంటలను ఆర్పివేశారు. ప్రమాదం జరిగిన సమయంలో హోటల్లో దాదాపు 60 మందికి పైగా ఉన్నారు. హోటల్ నిర్వాహకులు వంట వండే ప్రదేశానికి సమీపంలోనే పార్సిల్స్ కట్టిస్తుండటంతో ప్రమాదం జరిగిన సమయంలో వినియోగదారులు గాయపడ్డారు.

చిత్తూరు,అనంతపురం జట్ల విజయ ఢంకా



లోహిత్ లక్ష్మీనారాయణ, చిత్తూరు (112 పరుగులు)



మహేంద్ర, అనంతపురం (67 పరుగులు)



బాలాజీ, చిత్తూరు (నాలుగు వికెట్లు)



మల్లికార్జున, అనంతపురం (నాలుగు వికెట్లు)

కడప వైఎస్ఆర్ సర్కిల్ : జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఏసీఏ సౌత్ జోన్ అండర్ – 23 వన్డే క్రికెట్ టోర్నీ చిత్తూరు, అనంతపురం జట్లు విజయ ఢంకా మోగించాయి. గురువారం వైయస్ రాజారెడ్డి ఏసీఏ స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో నెల్లూరు జట్టుపై చిత్తూరు జట్టు 94 పరుగుల తేడాతో విజయం సాధించింది. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన చిత్తూరు జట్టు 50.0 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 296 పరుగులు చేసింది. ఆ జట్టులోని లోహిత్ లక్ష్మీనారాయణ అద్భుతంగా బ్యాటింగ్ ప్రదర్శించాడు. 102 బంతులను ఎదుర్కొని 10 బౌండరీలు, 3 సిక్సర్ల సహాయంతో 112 పరుగులు (సెంచరీ) చేశాడు. నికిత్ గౌడ్ 60 పరుగులు చేశాడు. నెల్లూరు జట్టులోని మాధవ్ 3 వికెట్లు తీసుకున్నాడు. అనంతరం 297 పరుగుల విజయ లక్ష్యంతో బ్యాటింగ్ కు దిగిన నెల్లూరు జట్టు 42.2 ఓవర్లలో 202 పరుగులకు అన్ని వికెట్లు కోల్పోయి ఓటమి చవిచూసింది. ఆ జట్టులోని మనివ్రత్ రెడ్డి 52, అర్జున్ 37 పరుగులు చేశారు. చిత్తూరు జట్టులోని బాలాజీ 4, రెడ్డి ప్రకాష్ 3 ముఖేష్ 2 వికెట్లు తీసుకున్నారు.

కేఎస్ఆర్ఎం మైదానంలో...

కేఎస్ఆర్ఎం క్రికెట్ మైదానంలో జరిగిన వేరొక మ్యాచ్‌లో కర్నూలు జట్టుపై 3 వికెట్ల తేడాతో అనంతపురం జట్టు విజయం సాధించింది. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన కర్నూలు జట్టు 38.1 ఓవర్లలో 196 పరుగులకు అన్ని వికెట్లు కోల్పోయింది. ఆ జట్టులోని నయీముల్లా 59, కనిష్ 51 పరుగులు చేశారు. అనంతపురం జట్టులోని మల్లికార్జున 4, దీపక్ 2, షేక్ కామిల్ 2 వికెట్లు తీసుకున్నారు. అనంతరం 197 పరుగుల విజయ లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన అనంతపురం జట్టు 34.4 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 198 పరుగులు చేసి 3 వికెట్ల తేడాతో విజయం సాధించింది. ఆ జట్టులోని మహేంద్ర రెడ్డి 67, అర్జున్ టెండూల్కర్ 40 పరుగులు చేశారు. కర్నూలు జట్టులోని కనిష్ 3, సొబ్జాన్ బాషా 2 వికెట్లు తీసుకున్నారు.